# మీరే ఆలోచించండి!

మధ్యాహ్నం ఒంటి గంట కావస్తోంది. గాలి లేదు. ఉక్కతో చెమటలు పడుతోంది శరీరం. ఫేను వేసుకోవాలంటే కరెంటు లేదు కరెంటు కోత కూడా దేశాన్ని యింకెన్నాళ్ళు పీడిస్తుందోననుకున్న చక్ర వర్తి, నిశ్చలంగా వున్న ఫేనుకేసి నిశ్చలంగా చూస్తున్నాడు.

అతని మొహంలో మచ్చుకయినా ఉత్సాహం అగుపించడం లేదు. నిస్పృహ, నిరుత్సాహం, దైన్యం, మిళితమై ఓ వింత అనుభూతి అతని మొహంలో తొణికిసలాడుతోంది. అతని మస్తిష్కం, ఆలోచనలతో కకావికమైపోతోంది. అందుకు కారణం, అతనికి ఉద్యోగం లేకపోవడమే! గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి నాలుగేళ్ళు ముగిసినా యింతవరకూ యే ఉద్యోగమూ దొరక్కపోయేసరికి, తన దేశాన్ని, దేశంలోని రాజకీయాల్ని, స్వార్థపరులైన రాజకీయ నాయకుల్ని తిట్టుకోకుండా ఉండలేకపోయాడు. అది, నిస్పృహతో కూడిన దుగ్ధ! అంతకుమించి మరేం కాదు.

కార్ఖానాలో చిన్న ఉద్యోగాల ఖాళీలు చాలా ఏర్పడ్డాయని, వాటి కోసం దరఖాస్తులు పెట్టుకోవచ్చునని ప్రకటించడంతో, తన చదువుకి అది దీటయిన ఉద్యోగం కాదని తెలిసినా, గత్యంతరం లేక దరఖాస్తు పెట్టుకున్నాడు, చక్రవర్తి. అయితే, తనలాంటివాళ్ళే గాకుండా, తనకంటె తక్కువ చదువుకున్నవాళ్లు, బొత్తిగా చదువులేనివాళ్ళు వేల సంఖ్యలో దరఖాస్తులు పెట్టుకున్నారని, వాళ్ళందర్నీ ఇంటర్వ్యూకి పిలుస్తున్నారని విన్నాక, నీరుగారిపోయాడు. అంతేకాదు — వేలకివేలు డబ్బు లంచాలుగా చేతులు మారుతోందని విని, మరీ తల్లడిల్లిపోయాడు. ఆ విషయమే తండ్రితో చెబితే, అయన తన నిస్సహాయతని వ్యక్తం చేశాడు. "ఒరేయ్ చక్రం, మీ చెల్లెలి వివాహం కోసం ముప్పయివేలు బ్యాంకులో ఉంచానురా, ఆ డబ్బు లంచంగా యిచ్చి నీకు ఉద్యోగం సంపాదించాననుకో, దాని పెళ్ళి జరిగేదెలా చెప్పు? రోజు రోజుకీ కట్నాలు విపరీతంగా పెరిగిపోతు న్నాయి. దాని పెళ్ళిని పోస్టుపోను చెయ్యలేను. నా నిస్సహాయతని అర్థం చేసుకోరా...." బాధగా అన్నాడు తండ్రి నీలకంఠం.

చక్రవర్తి, యేమీ అనలేకపోయాడు. తండ్రి కళ్ళల్లో సుళ్లుతిరుగుతూ వున్న అశ్రువులు, అతని మనస్సుని కరిగించేశాయి. తనకి ఉద్యోగం యెంత ముఖ్యమో, చెల్లెలి వివాహమూ అంత ప్రాముఖ్యత గలదే. తనకి ఉద్యోగం లేకపోయినా, యేదో విధంగా జీవితం గడిచిపోతుందేమో గాని, చెల్లాయి వివాహం జరక్కపోతే, వయస్సు మీదపడి, సమస్యల్ని సృష్టిస్తుంది....

అయినా, నిరుద్యోగ సమస్య, చక్రవర్తిలో ఆరని మంటలు రేపు తోంది. మంచంమీద నీరసంగా పడుకున్న చక్రవర్తి, నిర్లిప్తంగా ఫేను కేసే చూస్తున్నాడు.

తలుపు తోసుకుని యెవరో లోపలికి వచ్చిన శబ్దమయ్యింది. చక్ర వర్తి, అటుకేసి చూశ్ళేదు. చూడాలనిపించలేదతనికి. కాని, వచ్చిన వ్యక్తి, అతని తల్లి సీత.

"ఒరేయ్ చక్రం, ఏవిట్రా యిది? భోజనం చెయ్యకుండా, యిలా ఒంటరిగా ఈ గదిలో వుండి ఏవిటాలోచిస్తున్నావు? నీ ఉద్యోగం గురించేనా? ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది లేరా. ఇలా మధనపడుతూ ఆలోచించుకుని

కూచుంటే వస్తుందా ఏవిఁటి? అయినా, రోజులు ఇంత గడ్డుగా తయారైనా యేవిటి? ఓ చిన్న వుద్యోగం కోసం పాతికవేలు లంచమా? ఎంత అన్యాయం? ఇటువంటి అక్రమాల్ని అరికట్టేవారు లేరా?" ఆవేశం తెచ్చుకుని మరీ అంది ఓ తల్లిగా సీత, కొడుకు ప్రక్కనే కూచుంటూ.

"అంత డబ్బూ లంచంగా ఇస్తామని, ముందుకొచ్చిన వాళ్ళే అధికంగా వుంటే, ఈ అక్రమాల్ని బైటపెట్టే వాళ్ళింకెవరమ్మా?" అంత వరకూ పాటించిన మౌనాన్ని ఛేదించి అన్నాడు చక్రవర్తి.

"నువన్నదీ నిజమేన్రా, ప్రతివాడికీ స్వార్థం వుంది. ఇంతకీ, ఆ లంచం తీసుకుంటున్న వాళ్లెవరో తెలుసునా?"

చక్రవర్తి, ఆసక్తితో లేచికూచున్నాడు. "ఇటువంటి వ్యవహారాలు, బహిరంగంగా జరగవు కదమ్మా? ఎవరు తీసుకుంటున్నారో ఖచ్చితంగా తెలీదు. చూచాయగా ప్రచారాలు మాత్రం సాగుతున్నాయి. మధ్యవర్తులున్నారు కదా, వారికే ఇవ్వాలి డబ్బు" అన్నాడు, చక్రవర్తి.

"డబ్బుకి భయం లేదు కదా?" అంది సీత.

పరిస్థితి ఆశాజనకంగా తోచింది చక్రవర్తికి.

"భయం లేదనే అందరూ ఇస్తున్నారటమ్మా...."

"అయితే, అమ్మాయి వివాహం కోసం దాచిపెట్టిన పైకంలో పాతిక వేలు తీసి నీ ఉద్యోగంకోసం లంచంగా ఇమ్మని, మీ నాన్నగారితో చెబుతానుండు" అంది.

చక్రవర్తి కలవరపడ్డాడు, కంగారుగా తల్లికేసి చూశాడు, తన మూలంగా చెల్లాయి వివాహం ఆగిపోకూడదని, అతని ఉద్దేశ్యం.

"వద్దమ్మా! చెల్లాయి పెళ్ళి ఆగిపోకూడదు. దాని వివాహం చాలా ముఖ్యం. ఈ విషయంలో నేను రాజీ పడలేనమ్మా. నా ఉద్యోగమంటావా, దొరికినప్పుడే దొరుకుతుంది...." అన్నాడు ఆరాటంతో.

సీత, అదోలా నవ్వింది.

"చెప్పడమైతే సుళువుగా చెప్పావురా! కాని, చెప్పినంత నిబ్బరంతో నువ్వు నిశ్చింతగా ఉండలేకపోతున్నావే? భోజనం సంగతి కూడా విస్మరించి, నువ్విలా ఒంటరిగా ఈ గదిలో మధనపడుతూ పడున్నావంటే, నీ అంతరంగంలో యెటువంటి తుఫాను చెలరేగి ఉంటుందో, ఇట్టే అర్థం

చేసుకోవచ్చు. చెల్లాయి వివాహం గురించి అంటావా? ఇంకా సంబంధమేదీ నిశ్చయం కాలేదుగా. ముందు నీకు ఉద్యోగం దొరకనీ! తర్వాత ఆలోచిద్దాం" అంటున్న తల్లి మాటలకి అడ్డొచ్చాడు చక్రవర్తి.

"అది కాదమ్మా...." అని ఏమో చెప్పబోయాడు.

"నువ్వు ఇంకేం చెప్పొద్దురా! పద .... భోజనం చేద్దువు గాని...." అంటూ లేచి, బైటికి నడిచింది, సీత.

*　　　*　　　*

చక్రవర్తి తండ్రి, నీలకంఠం. అతనింకా ఉద్యోగంలో ఉన్నాడు. పదవీ విరమణ చెయ్యడానికి సుమారు ఓ సంవత్సరకాలం వ్యవధి ఉంది.

కూతురు సుజాత వివాహం చేసేస్తే, తన బాధ్యత తీరుతుందని ఎప్పుడూ అనుకుంటూ వుంటాడు, నీలకంఠం. అయితే, ఆమెకి తగిన సంబంధం, తమ తాహతుకి అందుబాటులో ఉన్నది, ఇంతవరకూ దొరకలేదు. సంబంధం కుదిరితే వివాహం చేసెయ్యాలని, బ్యాంకులో ముప్ఫయి వేలుంచాడు. డబ్బు లంచంగా యిస్తే, ఉద్యోగాలు దొరుకుతున్నాయనగానే, నీలకంఠంకి చాలామంది మిత్రులు సలహా ఇచ్చారు—తన కొడుక్కి ఆటువంటి లంచమిచ్చి అయినా, ఉద్యోగం వేయించమని. అయితే ఆ సలహాలు నీలకంఠంకి నచ్చలేదు.

అయితే, యిటీవల భార్య సీత నీలకంఠంపై ఒత్తిడి తీసుకొస్తోంది, అబ్బాయి ఉద్యోగం విషయంలో గట్టిగా ప్రయత్నించమని. ఇప్పుడు ఈ అవకాశం చేజారితే, మళ్ళీ రాదన్న భావాన్ని వ్యక్తం చేసింది. భార్య చెప్పింది కొంత సబబుగానే తోచింది, నీలకంఠంకి.

"అయితే, చక్రవర్తి ఉద్యోగం కోసం లంచం ఇవ్వమంటావు అంతేనా?" అన్నాడు.

"ఔనండీ! దేవుడి అనుగ్రహం వల్ల వాడికీ ఉద్యోగం దొరికిపోతే, మనకి ఒక సమస్య పరిష్కారమైనట్టవుతుంది కదా? అమ్మాయి వివాహం విషయం, ఆ తర్వాత ఆలోచిద్దాం" అంది సీత, ఉత్సాహంగా.

"సరే! లంచం ఇవ్వడానికి సిద్ధపడుతున్నాం. కాని, యెవరికివ్వడం ఆ లంచాన్ని సీతా?"

భర్త దారిలో పడినందుకు సంతోషించింది సీత.

"అదేవిటండి అలా అంటారు? మీ స్నేహితుల్లోనే మధ్యవర్తు లున్నారు కదా, వారిలో ఎవరికో ఒకరికిస్తే పోలా? ఆ మాత్రం నమ్మకం లేకపోతే యెలా చెప్పండి? ఇంత ఆలోచనెందుకు? మనకి సన్నిహితుడు, ఆ రామస్వామిగారికే ఇవ్వకూడదూ?" అంటూ సలహా ఇచ్చింది.

"ఔను సీతా! నాకు గుర్తు లేదు, అలాగే చేద్దాం...."

*　　　*　　　*

మర్నాడే, నీలకంఠం బ్యాంకు నుంచి పాతికవేలు విత్‌డ్రా చేసి, రామస్వామి దగ్గరికి వెళ్ళాడు. లంచం ఇచ్చి కొడుక్కి ఉద్యోగం చేయించుకోమని నీలకంఠంకి సలహా ఇచ్చిన స్నేహితుల్లో, రామస్వామి ఒకడు.

"స్వామీ, నిన్ను నమ్ముకుని, నీ సలహా మేరకు, అమ్మాయి పెళ్ళికని బ్యాంకులో ఉంచిన ఈ పాతికవేలూ తీసి, నీ చేతిలో పెడుతున్నాను. మా వాడికో దారి చూపించు ....నీ మేలు యెన్నటికీ మర్చిపోను...." అంటూ ఆ పాతికవేలూ రామస్వామి చేతిలో పెట్టాడు, నీలకంఠం.

రామస్వామి ఆ పైకాన్ని జేబులో పెట్టుకుని, సన్నగా నవ్వేడు. అప్పుడే కొడుక్కి ఉద్యోగం దొరికిపోయినంతగా సంబరపడిపోయి, తృప్తిగా నిట్టూర్చాడు, నీలకంఠం. సంతోషం నిండిన హృదయంతో ఇంటిముఖం పట్టాడు.

*　　　*　　　*

రోజులు మందకొడిగా సాగుతున్నాయ్. ఎంతోమంది నిరుద్యోగ యువకులు ఆ ఉద్యోగాలకోసం యెదురుతెన్నులు చూస్తున్నారు. ఇంతలో లంచం మొత్తం పెరిగిందని పుకార్లు వ్యాపించాయి. అది ఎంతవరకూ నిజమో తెలీదు గాని, మొత్తమంతా ఆఫీసర్లకే ఇస్తున్నామని మధ్యవర్తులు (బోకర్లు) చెబుతూ ఉంటే, తమకేమీ తెలీదని, తమ పేరు చెప్పుకుని మధ్యవర్తులే డబ్బు చేసుకుంటున్నారని ఆఫీసర్లు బాహాటంగా చెప్పుకుంటు న్నారు. అంతే గాని, ఆ వ్యవహారాల్నించి తాము తప్పుకుంటున్నామని మాత్రం అనడం లేదు. వాళ్ళు, ఇరుపక్షాల ప్రచారాలూ నమ్మలేకుండా ఉన్నారు, ప్రజలు! అయితే అందులో నిజమేదో తెలుసుకోవాలన్న జిజ్ఞాస

యెవ్వరికీ లేదు. . . ఎందుకూ అంటే, అదృష్టం తమకే పట్టవచ్చునన్న 'ఆశ' వాళ్ళని నోరు లేనివాళ్ళుగా చేసింది.

ఇటువంటి ప్రచారం ముమ్మరంగా సాగుతున్నా, పై అధికారులు మాత్రం నిమ్మకి నీరెత్తినట్టు యెటువంటి చర్యా తీసుకోకుండా మౌనం వహించారు. విజిలెన్సు డిపార్టుమెంట్, ఇంటిలిజెన్సు బ్రాంచి, వీళ్ళంతా ఏం చేస్తున్నారో, అర్థంకాలేదు ప్రజలకి. ఏవో అన్యాయాలు, అక్రమాలూ ఇంతకు ముందు సెలక్షన్లలోనూ జరిగాయి, ఇప్పుడూ జరుగుతున్నాయని అందరికీ తెలుసు. అయితే, ఫలానావాడు దోషులని నిర్ధారించలేక పోతు న్నారు. అది యెవరి స్వార్థమో యెవరి అలుసో, ఆ భగవంతుడికే తెలి యాలి మరి!

ఇంటర్వ్యూలు ముగిశాయి. ఎన్నో పుకార్లు, ప్రచారంలోకి వచ్చాయి. కాని, వాటిని పరిశోధించే నాధుడేడీ? ఎవరిజేబులు వారు నింపు కుంటున్నారు. అంతా అయోమయ స్థితి నెలకొంది.

*　　*　　*

సంబంధిత అఫీసర్లు, సెలవు మీద వెళ్ళారు. అది ఇచ్ఛాపూర్వ కంగా జరిగినదేమో తెలీదు గాని, అదే తరుణంలో సెలక్షను ఫలితాల్ని నోటీసు బోర్డులపై అంటించారు. లిస్టులో పేరున్నవాళ్ళు, సంతోషంతో గంతులేస్తున్నారు. పేరు లేనివాళ్ళు కంట తడి పెట్టుకుని, నిరాశతో, నిస్పృహతో తిరుగుముఖం పడుతున్నారు. చక్రవర్తి పేరు, లిస్టులోలేదు. అతను భోరున యేడ్చేశాడు.

ఈ నిరాశని నీలకంఠం తట్టుకోలేకపోయాడు. మొహం తిరిగి పడిపోయాడు. తోటి ఉద్యోగులు అతణ్ణి ఆసుపత్రికి తీసుకెళ్ళారు. లంచం కట్టిన తర్వాత కూడా కొడుక్కి ఉద్యోగం రాకపోవడం, అతడిని బాగా కృంగదీసింది. ఆ షాక్‌ని తట్టుకోలేక పోయాడు. అంతే కాదు_ కూతురి వివాహాన్ని వాయిదావేసి, కొడుకు భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుని యిచ్చిన పైకం అది. ఆ పైకం తిరిగి వస్తుందో, లేదోనన్న భయంకూడా అతడిని కృంగదీసింది.

సీత, సుజాత నిర్విణ్ణులయ్యారు. నీలకంఠం ఆసుపత్రిలో తేరు కున్నందుకు, భగవంతుణ్ణి మనసులోనే ప్రార్థించుకున్నారు.

చక్రవర్తి ఆవేశంతో వూగిపోతూ, రామస్వామి ఇంటికి వెళ్ళాడు. అతని కళ్ళల్లో క్రోధం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అతను వెళ్ళేసరికి రామస్వామి ఇంట్లో మరెవరో ఇద్దరు వ్యక్తులున్నారు.

"రామస్వామిగారూ! మీరిలా నమ్మకద్రోహం చేస్తారని అనుకోలేదండి. మా నాన్నగారు, మీరు చేసిన ఈ మోసానికి తట్టుకోలేక ఆసుపత్రి పాలయ్యారు. మా కుటుంబ సభ్యులమంతా నిరాశతో నీళ్ళుగారిపోయాం. ఏ ఆశల్ని, పెంచుకున్నామో అవన్నీ మట్టిపాలయ్యాయి. ఓ స్నేహితుడిగా, ఓ శ్రేయోభిలాషిగా మీరిలా చెయ్యడం న్యాయమేనా చెప్పండి? మీకు మేమేం అపకారం చేశామని, మమ్మల్నిలా గంగలో ముంచారు? మీకు చేతగాకపోతే ఆ లంచం పైకం తీసుకోకుండా ఉండాల్సిందండి ..." ఉద్రేకంతో చెప్పుకుపోయాడు. అతని కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. చివర్న గొంతు బొంగురుపోయింది.

రామస్వామి తాపీగా ఓ నిట్టూర్పు విడిచాడు. అతనిలోని గొప్పదనం ఆ ఓర్పే! అదే అతని నేర్పు!

"అంతా విన్నాను బాబూ! విన్నాను. విన్న దగ్గర్నించీ నాగుండెల్లో లావా ప్రవహిస్తోంది. నే నెంతగా బాధ పడుతున్నానో, నీకు అర్థంకాదు. నేను మీకేం ద్రోహం చెయ్యలేదు బాబూ! అటువంటి మనస్తత్వమే కాదు నాది. మీ అందరికీ తెలుసు. అదిగో, నేను ఎవర్నయితే ఆశ్రయించానో, యెవర్ని దేవుడిలా నమ్మానో, ఆ ఆఫీసరు నాకు ద్రోహం చేశాడు. నా విలువల్ని మంట గలిపాడు. నా నిజాయితీని నాశనం చేశాడు. నా జీవితానికి కళంకం తెచ్చాడు. నా ద్వారా వెళ్ళిన ఆరు కేసులూ చేస్తానని మాటిచ్చి, డబ్బు తీసుకుని, చివరికి రెండు కేసులేచేశాడు. అతని పరిస్థితులేవో అతను చెప్పుకున్నాడు. మిగతా డబ్బు యిచ్చేశాడు. అదీ పూర్తిగా యివ్వలేదు. ఒక్కో కేసుకి అయిదువేలు మినహాయించుకుని ఇచ్చేశాడు. ఏం చెయ్యను? వచ్చిందే దక్కిందనుకుని కుక్కిన పేనులా నోరు మెదపకుండా వచ్చేశాను. ఆ డబ్బూ ఇవ్వకపోతే యేం చేస్తాం చెప్పు. బాధ్యతగల ఆఫీసర్లే ప్రజల్ని యిలా మోసం చేస్తుంటే, మనకి ఇంకెవరు దిక్కు? 'బోఫోర్స్', 'బోఫోర్స్' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేసే ఈ రాజకీయ నాయకులు, పత్రికాధిపతులు, ఇక్కడ ఈ నిరుద్యోగం

విషయంలో ఎంత డబ్బు, ఎలా చేతులు మారుతూ వుందో చూడరు. అసలు ఈ విషయాన్నే పట్టించుకోరు .... అందుకే కొందరు వ్యక్తులు నిర్భయంగా ఈ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇదంతా యెందుకంటావ్?" అంటూ చక్రవర్తి మొహంలోకి చూశాడు రామస్వామి. చక్రవర్తికి కోపం వచ్చింది.

"నాకు అవన్నీ అనవసరం. మా డబ్బు మాకు ఇచ్చేయండి" అన్నాడు విసురుగా.

"ఆవేశపడకబ్బాయ్....మీ డబ్బు తప్పకుండా యిచ్చేస్తాను. నేనేం మోసగాణ్ని కాను" అంటూ లోపలికి వెళ్ళొచ్చాడు రామస్వామి. అతని చేతిలో వంద పాపాయిల నోట్ల కట్టలు రెండున్నాయి. "ఈ ఇరవైవేలు తీసుకెళ్ళు బాబూ. మీ నాన్నగారితో విషయాన్ని చెప్పు. నాకూ బాధగానే వుంది. కాని, ఏం చేస్తాం? ఆ ఆఫీసరు ఇలా మోసం చేస్తాడని వూహించ లేదు. ఇంక ఇటువంటి విషయాల్లోకి వెళ్ళనని చెవులు పట్టుకుంటున్నాను" అంటూ ఆ పైకాన్ని చక్రవర్తి కిచ్చాడు.

రామస్వామి క్రితంసారీ ఇలాగే అన్నట్టు చక్రవర్తికి గుర్తుంది అనేయాలనుకున్నాడుగాని, తమాయించుకున్నాడు. వీళ్ళంతా దొంగలు.... మోసగాళ్ళు.... డబ్బు కోసం గడ్డికరిచే వెధవలు ...అనుకున్నాడు మనసు లోనే. "మాకేం సహాయం చెయ్యకుండానే, ఆఫీసరు అయిదువేలు నొక్కి పట్టేశాడని మీరంటుంటే మేం ఏమీ చెయ్యలేమండీ? భగవంతుడంటూ వుంటే ఈ అన్యాయానికి తగిన శిక్ష వేస్తాడు."

రామస్వామి గతుక్కుమన్నాడు. "ఏమిటబ్బాయ్, నా మాటమీద నీకు నమ్మకం లేదా?" అన్నాడు కాస్తంత తొట్రుపాటుతో.

"నమ్మకం వుండేది కాబట్టే పాతికవేలు మీ చేతిలో పోశాడు మా నాన్న. నమ్మి యిలా మోసపోయాం .... మళ్ళీ ఇటువంటి పొరపాటు జరగదు లెండి...." అంటూ విసురుగా వెళ్ళిపోయాడు చక్రవర్తి.

రామస్వామి నీరైపోయాడు. అదో తృటికాలంపాటు మాత్రమే. మళ్ళీ ఓ చిరునవ్వు నవ్వేసి, అక్కడ కూచున్నవారితో సంభాషణ సాగించాడు.

కనీసం ఇరవైవేలు తిరిగొచ్చినందుకే, తండ్రి మనసు కాస్తంత

డుడుటపడుతుందన్న ఆశ చక్రవర్తికుంది. ఇంట్లో ఆ డబ్బు పెట్టేసి, నేరుగా ఆసుపత్రికి వెళ్ళాడు. తండ్రితో జరిగిందంతా చెప్పాడు.

నీలకంఠం అంతా విన్నాక, ఓ నిట్టూర్పు వదిలాడు. అతనికి కొంత పూరట కలిగింది. అయిదువేలు పూరికనే నష్టపోయామన్న బాధ వున్నా, ఆ ఇరవై వేలూ వచ్చినందుకే అతని సంతృప్తి, సగటు మనుషుల బ్రతుకులు ఇట్లాగే వుంటాయేమో!

* * *

అయితే నీలకంఠంకి, చక్రవర్తికి ఇంకా అటువంటి నిరాశావరులకి తెలీని నిజం ఒకటుంది. ఏ ఆఫీసర్లు ఎలా లంచాలు తింటున్నా, మధ్య వర్తులమని చెప్పుకున్నవాళ్లు ఏ విధంగా డబ్బు చేసుకుంటున్నా, రామస్వామి మాత్రం సులభ మార్గాన్ని ఎన్నుకున్నాడని!

రామస్వామి ఏ ఆఫీసరుకీ డబ్బు ఇవ్వలేదు. అదృష్టవశాత్తూ తాను డబ్బు తీసుకున్న వారిలో యెవరయినా సెలక్టయితే, వారిచ్చిన మొత్తం డబ్బు అతనిదే. దురదృష్టవశాత్తు సెలక్టు కాకపోతే, వారి డబ్బులో అయిదువేలు అప్పణంగా అతనికే చెందుతుంది. అతని నిజాయితీకి ధోకా వుండదు. ఆఫీసర్లని నిలదీసి అడిగే దమ్ము ఎవరికీ ఉండదు. అసలు ఆఫీసర్ల పేరు రామస్వామి చెబితేగా? శ్రమ లేకుండా డబ్బు చేసుకుంటున్న రామస్వామి తెలివి తేటలకు జోహార్లర్పించవల్సిందే. అయితే ఇటువంటి అవకాశాన్ని కలిగించిన వ్యవస్థకి మరిన్ని జోహార్లు.

* ఆంధ్రజ్యోతి, 14-10-1990 *